క్లుప్తంగా

కుట్టుమెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పేద మహిళలు స్వతంత్రంగా జీవించేందుకు రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుమెషీన్లు పంపిణీచేస్తున్నట్టు దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. భీమవరంలో మంగళవారం ఆరుగురు మహిళలకు రాజ్‌ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్లను పంపిణీ చేశారు. రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పట్టెం శుభాకర్, జీడీ కరుణాకర్, సాదె మహేష్, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌బీ స్కూల్లో యూనిటీ ఫర్ రన్



జేఎల్‌బీ స్కూల్లో నిర్వహిస్తున్న యూనిటీ ఫర్ రన్

సాక్షి, భీమవరం: జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఝాన్సీలక్ష్మీ భాయి (జేఎల్‌బీ) మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో మంగళవారం ఏకీకృతం ఐక్యత కోరుతూ యూనిటీఫర్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ ఏఎంఓ రామకోటేశ్వరరావు, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ ఎస్వీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఐఇ కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

వీరవాసరం: జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ కె.జ్యోతి కోరారు. రాయకుదురు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఇళ్ల లబ్ధిదారుల ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నత కోసం లేఅవుట్ ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలను కేటాయించిందని, లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, హౌసింగ్ ఏఈ కె.శ్రీరామచంద్రమూర్తి, గంగాధర్, సాధిక్, సాయి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పంచాయతీ కార్యాలయం



ప్రారంభానికి సిద్ధమైన కొత్తపూసలమర్రు పంచాయతీ కార్యాలయం

భీమవరం అర్బన్: భీమవరం మండలం కొత్త పూసలమర్రు గ్రామంలో పంచాయతీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామం నుంచి గూట్లపాడులో సచివాలయానికి రెండు కిలోమీటర్లు ఉండటంతో గ్రామస్తులు, లబ్ధిదారులు, వలంటీర్లు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు గ్రామానికి రావడానికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ సమస్యను ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ జల్లా కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తులసీరావు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా రూ.25 లక్షలు మంజూరు చేశారు. దీంతో తక్కువ వ్యవధిలోనే పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటర్లకు దోచిపెడుతున్న కేంద్రం

పెనుగొండ: సహజ సంపదను కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఆచంటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ మోసపూరిత విధానాలకు టీడీపీ వంత పాడుతోందన్నారు. ప్రజా సమస్యలే అజెండాగా ఈనెల 7, 8, 9 తేదీల్లో రాష్ట్ర జాత జిల్లాలో పర్యటిస్తుందని తెలిపారు. ఈ జాతకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తరలిరావాలన్నారు. అనంతరం 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

వీరవాసరం - మత్స్యపురి రోడ్డుకు మోక్షం

- 7.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.6 కోట్లు మంజూరు
- 1,800 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి
- చురుగ్గా మిగిలిన తారురోడ్డు నిర్మాణ పనులు



వీరవాసరం-మత్స్యపురి మార్గంలో బొబ్బనపల్లి వద్ద నిర్మించిన సీసీ రోడ్డు



తలతాడితిప్ప వద్ద వెట్‌మిక్స్‌తో వేసిన రోడ్డు

సాక్షి, భీమవరం: భీమవరం, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే వీరవాసరం- మత్స్యపురి రోడ్డుకు మోక్షం లభించింది. గోతులమయమైన ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాకపోకలకు సుమారు 12 ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు, ప్రయాణికులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విముక్తి కలిగింది. ఏడున్నర కిలో మీటర్ల రోడ్డును సుమారు రూ.6 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్నారు. తారురోడ్డు మొత్తం మట్టిరోడ్డుగా మారిపోవడంతో మత్స్యపురి గ్రామ ప్రజలు మండల కేంద్రమైన వీరవాసరం రావాలంటే అనేక అగచాట్లు పడేవారు. రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని గత ప్రభుత్వాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు అనేకసార్లు మొరపెట్టుకున్నా ఫలితంలేకపోయింది. కొన్ని సందర్భాల్లో ఆందోళనలూ చేశారు. దీంతో 2012లో కేవలం రూ.1.5 కోట్లు మంజూరు చేశారు. వీరవాసరం వద్ద కొంతమేరకు సిమెంట్ రోడ్డు నిర్మించి, మిగిలిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్ కృషితో రూ.6 కోట్ల మంజూరు

భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషితో వీరవాసరం - మత్స్యపురి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరుచేసింది. దీంతో సెప్టెంబర్ నెలలో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. వెనువెంటనే పనులు ప్రారంభించగా మత్స్యపురి, బొబ్బనపల్లి గ్రామాల్లో సుమారు 1,800 మీటర్ల మేరకు సిమెంట్ రోడ్డు నిర్మించారు. మిగిలిన రోడ్డు ఇప్పటికే ఒక వరుసలో వెట్‌మిక్స్ పనులు చేయగా మరో వరుస వెట్‌మిక్స్ రోడ్డు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ తారురోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి



వీరవాసరం - మత్స్యపురి రోడ్డు నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 1,800 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మించాం. మిగిలిన రోడ్డు తారుతో వేయాల్సి ఉంది. దీనికి ఇప్పటికే ఒక వరుస వెట్‌మిక్స్ పనులు పూర్తయ్యాయి. మరో వరుస వెట్‌మిక్స్ వేసి దానిపైన తారు రోడ్డు వేయాల్సి ఉంటుంది.

– డీఎస్ఎన్ మూర్తి, ఆర్‌అండ్‌బీ ఏఈ, వీరవాసరం

12 ఏళ్ల సమస్యకు పరిష్కారం



వీరవాసరం - మత్స్యపురి రోడ్డు గోతులమయం కావడంతో గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషితో ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు కావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. ఇప్పటికే సిమెంట్ రోడ్డు పనులు పటిష్టంగా పూర్తిచేశారు. మిగిలిన తారురోడ్డు పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగం.

– కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు (బాబు), ఏఎంసీ చైర్మన్, మత్స్యపురి

అట్లతద్ది సందడి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గ్రామాల్లో మంగళవారం అట్లతద్ది సందడి నెలకింది. మహిళలు, యువతులు వేకువ జామునే నిద్రలేచి తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి పూజా గదిలో ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ దేవికి తమలపాకులు, పసుపు, కుంకుమ, గంధం, పసుపు పువ్వులతో పూజలు చేసి అట్లు, ఇతర పదార్థాలతో నైవేద్యం సమర్పించి నోములు నోచుకున్నారు. కొత్తగా వివాహమైన యువతులు పుట్టింట వద్ద వాయినాలు ఇచ్చారు. దీంతో గ్రామాల్లో అట్లతద్ది సందడి నెలకొంది.

గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం మండలం పెదగరువు ఉప కేంద్ర పరిధిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతులు నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. దిరుసుమర్రు, చినగరువు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.1.30 కోట్లతో డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం



నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: పట్టణంలోని పలు రోడ్లు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి సాంకేతిక అనుమతి పొందినట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి సంబంధించి సాధారణ నిధులు రూ.1.30 కోట్ల వ్యయంతో 28 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయా పనులకు సాంకేతిక అనుమతి లభించడంతో అత్యవసరంగా చేపట్టాలని చైర్‌పర్సన్ హైమావతి చెప్పారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులకు బ్లీచింగ్ కొనుగోలు అంశంపై కాంట్రాక్టర్‌కు అనుమతినిస్తూ సమావేశం ఆమోదం తెలిపిందన్నారు. ప్రధాన రహదారి ప్రాంతంలో ట్రాఫిక్ పేరుతో తోపుడు బండ్లు, ఇతర చిరు వ్యాపారుల్ని తొలగించడం వల్ల వారి కుంటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతాయని హైమావతి పేర్కొన్నారు. దోమల బెడద నివారణకు మందు పిచికారీ చేయాలని కౌన్సిలర్ నేరెళ్ల ప్రసన్న విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ సమస్య, దొంగతనాలపై పోలీస్ శాఖ దృష్టి సారించాలని కౌన్సిలర్ గేదల అప్పారావు విజ్ఞప్తి చేశారు. ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగబాబు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, జిల్లా పెద్దిరాజు, దొడ్డి జగదీష్, కటికతల జాన్‌వెస్లీ, మోటుపల్లి కుమారి, అస్రపున్నీస్సా బేగం, నిమ్మల నాగు, కోఆప్షన్ సభ్యులు ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రి, కమిషనర్ జీ.కృష్ణమోహన్ పాల్గొనగా టీడీపీ కౌన్సిలర్లు సమావేశం మధ్యలో వాకౌట్ చేశారు.

ఉక్కుమనిషి పటేల్ సేవలు అమోఘం



భీమవరం (ప్రకాశంచౌక్): పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



వీరవాసరం: పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ బాబు

భీమవరం(ప్రకాశంచౌక్): దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు అమోఘమని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను స్థానిక కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి డీపీఓ పూలమాల వేసి, నివాళులర్పించారు. దేశ తొలి ఉపప్రధానిగా, హోం మంత్రిగా సమర్థవంతంగా పనిచేశారని, 565 సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేశారని, ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఏర్పాటుకు నాంది పలికారని గుర్తుచేశారు. పటేల్ జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా నిర్వహిస్తున్నారని, విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ పటేల్ జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిలో ఐక్యతా భావం పెంపొందేలా డీపీఓ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.ఆదిశేషు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్ ప్రసాదు, కమర్షియల్ టాక్సు డిప్యూటీ సహాయ కమిషనరు ఎం శేషు కుమారి, పురపాలక సంఘం ప్లానింగు అధికారులు పి.గౌరు, టి.బాలాజీ, వివిధ శాఖలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పటేల్ సేవలు స్ఫూర్తిదాయకం

వీరవాసరం: దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు తెలిపారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, చికిలే మంగతాయారు, గెద్దం భారతి, వేగేశ్న వర్మరాజు, కోడే అప్పారావు, కోడే వరలక్ష్మి, నల్లమిల్లి వేణుక, బీశెట్టి లక్ష్మి, పి.దుర్గా ప్రసాద్, వీరవల్లి శ్రీనివాస్, భవాని తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఐక్యంగా జీవించాలి



కార్తీక్‌కు పున్నయ్య కమిషన్ వివరాల పుస్తకాన్ని అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు గోపి

ఉండి: కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా ఐక్యమత్యంతో జీవించాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ అన్నారు.మంగళవారం ఉండి మండలం మహదేవపట్నంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను ఏ ఒక్కరూ దుర్వినియోగం చేసుకోకూడదన్నారు. ఎవరైనా తోటివారికి ఇబ్బంది కలిగేలా నడుచుకుంటే అటువంటివారిపై చట్టప్రకారం కేసులు నమోదవుతాయన్నారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసు గోపీ మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను పక్కాగా అమలు చేస్తూ ప్రతి ప్రాంతంలో వెనుకబడిన వారి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. దళితులపై అంటరానితనం, అత్యాచార నిరోధాలకు మండల అధికారులు ప్రతీనెల గ్రామాల్లో పర్యటించి అందరికీ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస నాయకులు మేడపాటి ప్రశాంత్, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీలో సభ్యులుగా చేర్చుకోవాలి

ఆకివీడు: స్థానిక మత్స్యకార సహకార సొసైటీలో పల్లెకారుల్ని సభ్యులుగా చేర్చుకోవాలని పలువురు మత్స్యకారులు మంగళవారం ఎఫ్‌డీఓ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సొసైటీలో కొత్త సభ్యుల్ని చేర్చుకోవడంలేదని వారు పేర్కొన్నారు. తరతరాలుగా కొత్త సభ్యులు లేక, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, ఇతర సహకారం అందడంలేదని వారు వాపోయారు. సొసైటీలో కొత్త సభ్యులను చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన వారి స్థానంలో కుటుంబానికి చెందిన వ్యక్తిని సభ్యుడిగా చేర్చుకోవాలని కోరారు. దుర్గారావు, నాగరాజు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ స్థానికంగా ఉండి, వేటాడే వారికి మాత్రమే సభ్యత్వం సొసైటీలో లభిస్తుందని చెప్పారు.


బాస్కెట్‌బాల్ విజేతలకు అభినందన



బాస్కెట్‌బాల్ విజేతతను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జేఎన్టీయూకే సెంట్రల్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ కేవి మురళీకృష్ణంరాజు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విజేతల వివరాలను ఆయన వెల్లడించారు. పీడీ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ అక్టోబర్ 29, 30 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా మైలవరం లక్కిరెడ్డి బాల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో టీం కెప్టెన్‌గా వి.సాత్విక, టీం సభ్యులుగా డి.సంధ్య, బీఎల్ సత్యశ్రీ, కె.సాయి ప్రసన్న, బి.అరుణభాయ్, బి.చైతన్య లహరి, ఎం పూజమన్మిత, ఎ.మేఘనాభాను, ఎస్‌కే ఖాదరున్నీషా, కె.సుప్రియ, డి.నిహారిక, కె.ప్రవల్లిక పాల్గొన్నారని చెప్పారు. కేరళలో జరిగే సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు జేఎన్టీయూకే టీం తరపున తమ విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ హరి మోహన్, జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో కొవ్వొత్తుల ర్యాలీ



పాలకోడేరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పాలకోడేరు: అమర వీర జవానుల త్యాగాలకు ప్రతీకగా ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాలకోడేరులో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ సరిహద్దుల్లో చైనా రక్షణ బలగాలు సియాచిన్ ప్రాంతాన్ని ఆక్రమించుకుకోవడానికి 1959 అక్టోబర్ 21న యత్నించినప్పుడు మన జవానులు 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డ కట్టే మంచు పర్వతాల మధ్యలో హాట్ స్ప్రింగ్స్ వద్ద ధైర్య సాహసాలతో పోరాడారని తెలిపారు. ఈ పోరాటంలో పది మంది అసువులు బాసారని అప్పటి నుంచి ఇదే రోజున వారిని తలచుకుంటూ సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని వివరించారు.

పోలీసులు, వారి పిల్లలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసులు, వారి పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు మంగళవారం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిగా ఆర్ఎస్ఐ కె.లెనిన్ రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా డబ్ల్యూఆర్ఎస్ఐ ఇ.ఇందుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా కానిస్టేబుల్ వి.మణికంఠ రూ.2 వేలు ఏఎస్పీ సుబ్బరాజు చేతులు మీదుగా అందుకున్నారు. పోలీస్ పిల్లలకు నిర్వహించిన పోటీల్లో జి.తేజస్వి (ప్రథమ) జి.రోహిత్ (ద్వితీయ), ఎస్ మనోజ్ఞ(తృతీయ) బహుమతులు అందుకున్నారు. పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో డబ్ల్యూఆర్ఎస్ఐ ఇ.ఇందుమతి (ప్రథమ) టి.బిందుభవాని (ద్వితీయ), ఆర్ఎస్ఐ కె.లెనిన్ (తృతీయ) బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ మోజెస్, డీసీఆర్బీ సీఐ అహ్మదున్నీసా, ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



కోరుకొల్లులో వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఆర్డీవో కె శ్రీనివాసులు రాజు, చిత్రంలో మంతెన యోగీంద్ర కుమార్

పాలకోడేరు: ఆరోగ్యంపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకూడదని భీమవరం ఆర్డీవో కె. శ్రీనివాసులు రాజు అన్నారు. పాలకోడేరు మండలం కోరుకొల్లులో రాష్ట్ర ఫారెస్ట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మంతెన యోగీంద్రకుమార్ (బాబు) ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేసి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంతెన భారతి, మైప సర్పంచ్ గొట్టుముక్కల జయంతి, ఎంపీటీసీ తంగెళ్ల మంజుల, ఉపసర్పంచ్ చేకూరి చంటి రాజు, గొట్టుముక్కల తిరుపతిరాజు, నాయకులు పాలా రాధాకృష్ణ, సోమేశ్వరరావు, కొండేటి శివకుమార్, శ్రీనివాస్ వర్మ, చిన చంటి పంచాయతీ కార్యదర్శి శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

2న భీమవరంలో రైతు సదస్సు

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం అనుచరిస్తోన్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసగా నవంబర్ 2న స్థానిక ఆనంద్ ఫంక్షన్‌హాల్లో రైతు సదస్సు నిర్వహించనున్నట్టు రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి నాయకుడు లంక కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రిశ్వరావు పాల్గొంటారని పేర్కొన్నారు. రైతు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టినట్టు తెలిపారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, భీమవరం: భీమవరంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చెల్లబోయిన రంగారావు, కిల్లరి మలేశ్వరరావు మాట్లాడుతూ 1920 బొంబాయిలో ఏఐటీయూసీని స్థాపించారని చెప్పారు. సమానపనికి సమాన వేతనం, క్లాప్ డ్రైవర్స్ వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని, కార్మిక చట్టాల రద్దును విరమించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎం లక్ష్మీపతి, బి.సత్యనారాయణ, బంగారు దుర్గారావు, రమణ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సరస్వతి బాధ్యతల స్వీకరణ

ఆకివీడు: దుంపగడపలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీ పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా పీఎస్. సరస్వతీ దేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ఆవరణలో ఆమెకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎం. బ్రహ్మం బాధ్యతలు అప్పగించారు. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకురాలిగా ఆమె పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. అధ్యాపకులు, సిబ్బంది ఆమెను సత్కరించారు.

వేగంగా పైపులైన్ అభివృద్ధి పనులు



పల్లిపాలెంలో నిర్వహిస్తున్న పైపులైన్ పనులు

భీమవరం అర్బన్: భీమవరం మండలం ఎల్‌వీఎన్ పురం గ్రామ పంచాయతీలోని పల్లిపాలెంలో పైపులైన్ అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. గతంలో పల్లిపాలెం గ్రామానికి తాగునీరు సరిగా రాకపోవడంతో సర్పంచ్ కేతా నాగబాబు, గ్రామస్తులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రూ.29 లక్షలు మంజూరు చేసి సమస్యను పరిష్కరించారు. పైపులైన్ అభివృద్ధి పనులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణుల పింఛన్ అర్హత వయస్సు తగ్గించాలి

పాలకొల్లు అర్బన్: నాయీ బ్రాహ్మణులకు పింఛన్ అర్హత వయస్సును 50 ఏళ్లకు తగ్గించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు గుమ్మలూరి శ్రీహరి, ప్రధాన కార్యదర్శి కొడవర్తి శివప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో జరిగిన జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘ ప్రథమ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు.